# శ్రీ యాదగిరి లక్ష్మీనృసింహ సుప్రభాతం

(ఆంధ్ర తాత్పర్య సహితం)

శ్రీ ఉ. వే. శ్రీమాన్ వంగీపురం నరసింహాచార్య విరచితం
(పూ. స్థానాచార్యులు ----యాదగిరి దేవస్థానము)

**1.కౌసల్యా సుప్రజా ! రామ ! పూర్వా సంధ్యా ప్రవర్తతే**

**ఉత్తిష్ఠ నరశార్దూల !కర్తవ్యం దైవ మాహ్నికం**

తాత్:మహర్షి విశ్వామిత్రుడు శ్రీరామచంద్రుని మేలుకొలుపుచున్నాడు,"ఓ శ్రీరామచంద్రా ! నిను గన్న కౌసల్యాదేవి సత్సంతానవతి. నీ వంటి మహనీయుని కనిన ఆ దేవి చాలా అదృష్టవంతురాలు. ప్రాతఃకాలమగుచున్నది, స్నానం,సంధ్య, దేవ పూజ మొదలగు నిత్యకృత్యములు చేయవలయును,త్వరగా మేల్కొనుము

**2.ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద!**

**ఉత్తిష్ఠ గరుడధ్వజ! |**

**ఉత్తిష్ఠ కమలాకాంత!**

**త్రైలోక్యం మంగళం కురు ||**

తాత్:ఓ గోవింద! త్వరగా మేల్కొనుము. ఓ గరుడధ్వజా! లే లెమ్ము. ఓ కమలాపతీ! శీఘ్రముగ మేల్కొని ముల్లోకములకు మంగళమొనగూర్చుము.

**లక్ష్మీదేవిని మేల్కొలుపుట **

**3.యాదాద్రినాథ శుభమందిర కల్పవల్లి!**

**పద్మాలయే! జనని! పద్మభవాదివంద్యే! |**

**భక్తార్తి భంజని! దయామయ దివ్యరూపే!**

**లక్ష్మీనృసింహదయితే! తవ సుప్రభాతం ||**

తాత్: ఓ లక్ష్మీ! నీవు శ్రీ యాదగిరి లక్ష్మీనృసింహుని దివ్యమందిరములో కల్పలతవంటిదానవు. వికసించిన కమలములయందు నిత్యనివాసము చేయుదానవు. ముల్లోకములకు తల్లివి. బ్రహ్మాదిదేవతలు నిన్ను సర్వదా సేవించుచుందురు. నీ శరణు జొచ్చిన భక్తుల ఆపదల రూపుమాపు తల్లివి. కరుణామూర్తివి. శ్రీ లక్ష్మీనృసింహుని ఇల్లాలివి. ఓ తల్లీ! నీకు సుప్రభాతము.

**శ్రీ లక్ష్మీనృసింహుని మేల్కొలుపుట**

**4.జ్వాలా నృసింహ! కరుణామయ! దివ్యమూర్తే!**

**యోగాభినందన నృసింహ! దయాసముద్ర!**

**లక్ష్మీనృసింహ! శరణాగత పారిజాత!**

**యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||**

తాత్: ఓ కరుణామయుడవైన జ్వాలానృసింహ ! ఓ దయామయుడవైన యోగానంద నృసింహ! శరణాగతులైన భక్తులపాలిటి కల్పవృక్షమైన ఓ లక్ష్మీనృసింహ! యాదగిరినాథా! నరహరీ! నీకు సుప్రభాతము అగుగాక!
పై రెండు శ్లోకములవలన లక్ష్మీనారయణ స్వరూపుడైన లక్ష్మీనరసింహుడే మనకు ఉపాస్య దేవతయని తెలియుచున్నది

5.శ్రీ రంగ వేంకట మహీధర హస్తిశైల
శ్రీయాదవాద్రి ముఖ సత్వనికేతనాని |
స్థానానితేకిల వదంతి పరావరజ్ఞా:
యాదాద్రినాథ! నృహరే తవ సుప్రభాతం ||
తాత్: శ్రీరంగము, తిరుపతి, కంచి, తిరునారాయణ పురము మొదలగు పుణ్యక్షేత్రములు అన్నీ నీ నిత్య నివాసస్థానములని పెద్దలు చెప్పుచున్నారు ఓ యాదగిరినాథ! నరహరీ! నీకు సుప్రభాతమగుగాక
6.బ్రహ్మాదయస్సురవర ముని పుంగ వాశ్చ
త్వాం సేవితుం వివిధ మంగళ వస్తు హస్తా: |
ద్వారేవసంతి నరసింహ భవాబ్ధిపోత
యాదాద్రినాథ! నృహరే తవసుప్రభాతం ||
తాత్: ఓ యాదగిరినాథ! నరహరీ బ్రహ్మాదిదేవతలు, మునులు నిన్ను సేవించుటకై తులసి, పువ్వులు, ఫలములు, మొదలగు మంగళ ద్రవ్యముల తీసుకొని నీ ద్వారము కడ నిలచి యున్నారు త్వరగా లెమ్ము నీకు సుప్రభాతము
7.ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాది భక్త రసికా భవదీయ సేవాం |
వాంఛంత్యనన్య హృదయా: కరుణాసముద్ర
యాదాద్రినాథనృహరే తవ సుప్రభాతం ||
తాత్: ఓ కరుణావరుణాలయా! యాదగిరినాథా! నరసింహా! ప్రహ్లాదుడు, నారదుడు, పరాశరుడు, పుండరీకుడు, వ్యాసుడు మొదలగు పరమ భక్తులు నీ సేవాతత్పరులైకైంకర్యమును కోరుచున్నారు త్వరగా మేలుకొనుము నీకు శుభోదయమగుగాక
8.త్వద్దాస్య భోగ రసికాశ్శఠజిన్ముఖార్యా :
రామానుజాది మహనీయ గురు ప్రధానా: |
సేవార్థ మత్ర భవదీయ గృహాంగణస్థా :
యాదాద్రినాథ నృహరే తవ సుప్రభాతం ||
తాత్: నీకైంకర్యమే పరమభోగ్యమను నమ్మాళ్వారు మొదలగు ఆచార్యులు మహనీయులైన భగవద్ రామానుజులు మొదలగు ఆచర్యులు నీకైంకర్యం కొరకై మందిర ద్వారము కడ వచ్చి నిలిచియున్నారు ఓ యాదగిరినాథ నరహరీ నీకు సుప్రభాతము
9.భక్తా స్త్వదీయ పదపంకజ సక్తచిత్తా :
కాల్యం విధాయ తవ కందర మందిరాగ్రే |
త్వద్దర్శనోత్సుకతయా నిబిడం శ్రయంతే
యాదాద్రినాథ నృహరే తవ సుప్రభాతం ||
తాత్: ఈ లోకములోని భక్తులంతా త్వరగా లేచి నిత్య కృత్యముల తీర్చుకొని నీ పాదపద్మముల దర్శనము కొరకై నీ మందిర ప్రాంగణమున వచ్చి చేరుచున్నారు. ఓ యాదగిరి నాథా నరహరీ! నీకు సుప్రభాతము

10.దివ్యావతార దశకే నరసింహ తేతు
దివ్యావతార మహిమా నహి దేవగమ్య: |
ప్రహ్లాద దానవ శిషో:కిల భక్తిగమ్య :
యాదాద్రినాథ నృహరే తవ సుప్రభాతం ||

తాత్: ఓ నరహరీ నీ దివ్యములైన పది అవతారములలో నీ నృసింహావతర మహత్వమును బ్రహ్మాదిదేవతలుకూడ తెలుసుకోలేకున్నారు దానవ వంశుడైననూ ప్రహ్లాదునికిమాత్రము సులభ గ్రాహ్యమైనది కారణమేమైన అతడు పరమభక్తుడు కావున తన భక్తి విశేషముచే తెలుసుకోజాలినాడు(భగవంతుడు భక్తిమాత్ర సులభుడు అని భావము) ఓ యాదగిరినాథా నీకు శుభోదయమగుగాక

11.శ్రీ యాదవాద్రి శిఖరే త్వ మహోబిలేపి
సింహాచలేచ శుభమంగళశైల రాజే |
వేదాచలాది గిరి మూర్ధసు సుస్థితోసి
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: శ్రీ యాదవాచలం, అహోబిలం, సింహాచలం, మంగళగిరి, వేదాద్రి మొదలగు మహా పర్వత శిఖరములయందు నీవు సుఖముగా నివసించువాడవు. ఓ యాదగిరి గహ్వరవాసా! నరహరీ! నీకు సుప్రభాతము సింహాకృతి ధరించిన భగవంతునికి పర్వతపు శిఖరములు, గుహలు సుఖ నివాసమునకు యోగ్యములైనవి కావచ్చునని భావము.

12.కామ్యార్థినో వరద కల్పకం త్వాం
సేవార్జిన స్సుజన సేవ్య పదద్వయం త్వాం |
భక్త్యా వినమ్ర శిరస: ప్రణమంతి సర్వే
యదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: ఓ వరదా! తమ తమ అభీష్ట సిద్ధిని కోరు భక్తులు నిన్ను కల్పవృక్షముగా భావించి నమస్కరించుచున్నారు. కోరిన కోర్కెల నన్నింటిని తీర్చునది కల్పవృక్షము, అట్టి కల్పవృక్షపు కోర్కెలను తీర్చు వాడవు నీవు. కల్పవృక్షమునకు ఆ శక్తిని ప్రసాదించినవాడవు నీవే కదా యని భావము. మరియు ప్రాకృతిక వాంఛలను వీడి నీకైంకర్యమును మాత్రమే కోరు పరమ భాగవతోత్తములు నీ పాద సేవకై నమస్కరించుచున్నారు.ఈ విధముగా అందరి కోర్కెలను తీర్చు నేర్పుగల ఓ యాదగిరి నరసింహా! నీకు సుప్రభాతము.

13.త్వన్నామమంత్ర పఠనేన లుఠంతి పాపా :
త్వన్నామమంత్ర పఠనేన లుఠంతి దైత్యా : |
త్వన్నామమంత్ర పఠనేన లుఠంతి రోగా :
యదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: నీ నామమంత్ర పఠనముచే పాపములు పారిపోవును. భూతప్రేత పిశాచాదులు తొలగును. భయంకరమైనవ్యాధులు తొలగిపోవును. ఓ యాదగిరినాథా!నీకు సుప్రభాతము

14.లక్ష్మీనృసింహ! జగదీశ! సురేశ! విష్ణో!
జిష్ణో! జనార్దన! పరాత్పర! విశ్వరూప!
విశ్వప్రభాతకరణాయ కృతావతార!
యదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: ఓ లక్ష్మీనృసింహా! ఓ జగదీశ! ఓ సురేశ! ఓ విష్ణో! ఓ జిష్ణో! ఓ జనార్దన! ఓ పరాత్పరా! ఓ విశ్వరూపా! ప్రపంచమునకు నీ దివ్య జ్యోతితో వెలుగును ప్రసాదించడమున్కై అవతరించిన ఓ యాదగిరినాథ! నరహరీ! నీకు సుప్రభాతము

15.త్వన్నామమంత్ర పఠనం కిల సుప్రభాత
మస్మాకమస్తు తవచాస్తుచ సుప్రభాతం |
అస్మత్సముద్ధరణమేవ, విచిత్రగాధ!
యదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్:నీ నామమంత్ర పఠనమే మాకు సుప్రభాతమగుగాక.మమ్ముల సం రక్షించుటే నీకు సుప్రభాతమగుగాక! ఓ చిత్ర విచిత్ర చరిత్రలుగల యాదగిరి నరసింహా! నీకు సుప్రభాతము

16.త్వత్ పూజకా: పరివృఢా: పరిచారకాశ్చ
నిత్యార్చనాయ విధివద్విహిత స్వకృత్యా : |
యత్త స్త్వదీయ శుభగహ్వార మందిరాగ్రే
యదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: నీ సన్నిధి యందు నిత్యార్చన చేయు అర్చక స్వాములు, పరిచారకులు, యజమానులు మొదలగు నీ పరివారమంతయు త్వరగా స్నాన సంధ్యాది నిత్య కృత్యములు తీర్చుకొని నీ గుహప్రాంగణమున నీ సుప్రభాతమ్ముకై వేచియున్నారు. ఓ యాదగిరినాథ! నరహరి! నీకు శుభోదయమగుగాక

17.ప్రాభాతకీ మపచితిం పరికల్పయంత:
కుండాశ్చ పూర్ణజల కుంభ ముపాహరంత: |
శ్రీవైష్ణవా: పరిపతంతి హరే! నృసింహ!
యదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: ఓ నృసింహా! నీ ప్రాత: కాలిక పూజావిధి నిర్వర్తించుటకొర్కై శ్రీవైష్ణవులు కొందరు పూజా సామగ్రిని సిద్ధము చేయుచున్నారు. కొందరు గుండము నుండి పూర్ణ కుంభములను తీసుకొని మంగళవాద్యములతో వచ్చుచున్నారు. ఓ యాదాద్రినాథా! నరహరీ! నీకు సుప్రభాతము

18.సూర్యాభ్యుదేతి వికసంతి సరోరువాణి
నీలోత్పలానిహిభవంతి నిమీలితాని |
ప్రాగ్దిఙ్ముఖే ఉ రుణ గభస్తి గణోభ్యుదేతి
యదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: ఓ యాదగిరినాథా! సూర్యుడు ఉదయించబోతున్నాడు, సరస్సులలో కమలములు వికసించుచున్నవి,నల్ల కలువలు చంద్రాస్త సమయముతో ముకుళించుకొని పోవుచున్నవి, తూర్పు దిక్కున అరుణోదయమగుచున్నది, ఓ యాదగిరినాథా! నృహరే! నీకు సుప్రభాతము

19.మందానిల స్సురనది కమలోదరేషు
మందంవిగాహ్య శుభసౌరభ మాదధాన: |
హర్ష ప్రకర్ష ముపయాతిచ సేవితుం త్వాం
యదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: ప్రాత:కాలపు మందమారుతము ఆకాశగంగలోని కమలముల పరిమళమును తీసుకొని నిన్ను సేవించుటకొరకై మహోత్సాహముతో వచ్చుచున్నది.ఓ యాదగిరినాథా! నరహరీ! నీకు సుప్రభాతము

20.తారాగణో వియతి మజ్జతి సుప్రభాతే
సూర్యేణ సాక మవలోకయితుం త్వదీయం |
శ్రీ సుప్రభాత మవభాసిత సర్వలోకం
యదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: సర్వ లోకములకు ప్రకాశమును ఒసగునట్టి నీ సుప్రభాత సమారోహమును సూర్యునితో కలిసి వచ్చి చూచుకో యన్నట్లు నక్షత్రములు మెల్లమెల్లగా ఆకాశమున మునిగిపోవుచున్నవి. ఓ యాదగిరినాథా! నరహరీ! నీకు సుప్రభాతము

21.పక్షిస్వనాశ్చ పరిత: పరిసంపతంతి
కూజంతి కోకిలగణా: కలకంఠరావై: |
వాచా విశుద్ధకలయానువదంతి కీరా:
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్:పక్షుల కిలకిల ధ్వనులు అన్ని దిక్కులనుండి వినవచ్చుచున్నవి. కోకిలలు కమ్మగా పాడుచున్నవి. చిలుకలు మధుర మధురముగా నీ సుప్రభాతమును అనువదించుచున్నవి.ఓ యాదగిరినాథ! నరహరీ! నీకు సుప్రభాతము

22.పల్లీశు వల్లవజనా: స్వగృహాంగణేశు
ధేనూర్దుహంతి వినిభాంతి విశేష దృశ్యా |
గోపాలబాల ఇవ భక్త హృదంబుజేశు
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: పల్లెలోని గొల్లవారు లేచి తమతమ ఇండ్ల ముందర పాలు పితుకుచున్నారు.ఆ సమయమున వారు పరమ భక్తుల హృదయాలలో బాలకృష్ణుని వలె విశేషముగా ప్రకాశించుచున్నారు, పాలు పిండే వేళ ఐనది. తెల్లవారుచున్నది అని భావము. ఓ యాదగిరినరహరీ! నీకు సుప్రభాతము

23.గాఢాంధకారపటలం గగనం జహాతి
మోహాంధకార ఇవ సన్మనుజం సమస్తం |
రాగో విరాగ ఇవ సంవిశతి ప్రకామం
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: ఓ యాదగిరి నాథా! సత్పురుషుని మోహాంధకారము వీడినట్లు ఆకాశమును గాఢాంధకారము విడుచు చున్నది. సత్పురుషుని విరాగము ఆవిర్భవించినట్లు ఆకాశమున రాగము అనగా ఎరుపుదనము వ్యాపించుచున్నది త్వరగా లెమ్ము. నీకు శుభోదయమగుగాక

24.నిద్రా జహాతి హి జనాన్ సుమునిం యథావత్
ప్రజ్ఞాప్యుదేతి హి జనేశు మునౌ యథావత్ |
సక్తిర్జనేశు హి యథా చ మునౌ విరక్తి :
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: మునిజనమును వీడినట్లు నిద్ర మానవులను కూడా విడుచుచున్నది. మరియు మునిజనమునందువలె జనులలోగూడ ప్రజ్ఞ ఉదయించుచున్నది. మునిగణమున విరక్తి ప్రకాశించునట్లు మానవులలో అనురక్తి శోభించుచున్నది. ఓ యాదగిరినాథ! నీకు సుప్రభాతము

25.ఫుల్లాని పంకజవనాని విశుద్ధసత్వ
ఫుల్లాని సజ్జనమన:కమలాని యద్వత్ |
భా శ్శుద్ధ సత్వ మివ భాతి విదిక్షు దిక్షు
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: శుద్ధ సాత్వికభావముతో సజ్జనుల మన: కమలములు వికసించినట్లుగా సరస్సులయందు తామరపువ్వులు వికసించుచున్నవి. సజ్జనుని శుద్ధ సత్వస్వభావము దేశవిదేశములయందు వ్యాపించినట్లు వెలుతురు దిగంతములయందు వ్యాపించుచున్నది. ఓ యాదగిరి నరహరీ! నీకు సుప్రభాతము

26.బ్రహ్మా స్వయం సురగణై స్సహ లోకపాలై:
ధామ ప్రవిశ్య తవ మండపగోపురాఢ్యం |
పంచాంగశుద్ధి మభివర్ణయతి త్వదీయాం
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||

తాత్: బ్రహ్మదేవుడు అష్ట దిక్పాలకులతోను, దేవతలతోను, మండపములు గోపురములతో ప్రకాశించు నీ మందిరమునకు విచ్చేసి నీ నిత్య గ్రహచారము చెప్పుచున్నాడు. యాదగిరినాథా!నీకు సుప్రభాతము

27.విఖ్యాతవైద్యజన వంచక రోగజాల
విఖ్యాతవైద్య ఇతి రొగనిపీడితా స్త్వాం |
నిశ్చిత్య ధామ తవ దూరత ఆపతంతి
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||
తాత్: సుప్రసిద్ధులైన వైద్యులు మొదలగు వారినిగూడ మోసగించునట్టి అనగా వారికికూడ సాధ్యము కానట్టి భయంకర రోగములను గూడ రూపుమాపునట్టి ఘనవైద్యునిగా నిన్ను భావించుకొని దూర దూరములనుండి జనులు నీ మందిరమునకు వచ్చి చేరుచున్నారు, ఓ యాదగిరినాథా! త్వరగా లెమ్ము. నీకు శుభోదయమగుగాక.
28.భూతగ్రహాది బలవత్తర తాప యుక్తా :
బాణావతీముఖ మహోగ్ర పిశాచ విద్ధా : |
స్నాతా: ప్రదక్షిణవిధా వుపయాంతి నాథ
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||
తాత్: భూత ప్రేత పిశాచాదులు, బాణావతి మొదలగువాటితో పీడితులైన జనులు స్నానము చేసి నీ ప్రదక్షిణము కొర్కై వచ్చుచున్నారు. ఓ యాదగిరి నరహరీ! నీకు సుప్రభాతము
29.సంతానహీనవనితా స్సరసి త్వదీయె
స్నాత్వా జలార్ద్రవసనా స్తవ దర్శనాయ |
ఆయాంతిసంతతివరప్రద!దేవదేవ!
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||
తాత్: ఓ దేవదేవా! సత్సంతాన ఫలప్రదా! నరసింహా! సంతానము లేని స్త్రీలు సంతానముకొర్కై నీ గుండమున స్నానము చేసి, తడిబట్టలతోనే నీ దర్శనముకొర్కై వచ్చుచున్నారు. ఓ నరహరీ! నీకు సుప్రభాతము
30.యద్దుష్ట సంహరణ ముత్తమలోకరక్షా
దీక్షాం వ్యనక్తి తవ రూప మహో నృసింహా! |
తచ్చాత్ర యాదగిరి మూర్ధని సంవిభాతి
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||
తాత్: నీ అనంత రూపములలో ఈ నరహరి రూపము దుష్టశిక్షణము,శిష్టజన సం రక్షణమును ప్రకాశింపజేయుచున్నదో అట్టి రూపము ఈ యాదగిరి శిఖరముపై చక్కగా భాసించుచున్నది. ఓ యాదగిరినాథా! నీకు సుప్రభాతము
31.ప్రహ్లాద పుణ్యాజన పుణ్యబలా త్ప్రతీతం
రూపం జన స్తవ హరే! నిగమాంతవేద్యం |
ప్రాతఃస్స్మరంస్తరతి సంసారణాంబురాశిం
యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||
తాత్: వేదవేదాంతములచే ప్రకాశింపజేయబడు నీ రూపము ప్రహ్లాదుడను రాక్షస బాలకుని పుణ్య విశేషము వల్ల ఇవ్విధముగా ప్రకటితమైనది. ఇట్టి నీ దివ్య రూపమును ప్రాతఃకాలమున స్మరించు మానవులు సుఖముగా సంసార

సముద్రమును దాటగలుగుదురు. ఓ యాదగిరినాథా! నీకు సుప్రభాతము

**32.శ్రీ సుప్రభాత మిదమచ్యుత కైతవోక్త**

**మప్యచ్యుతం భవతు భక్తజనైక వేద్యం |**

**లక్ష్మీనృసింహ తవ నామ శుభప్రభావాత్**

**యాదాద్రినాథ! నృహరే! తవ సుప్రభాతం ||**

తాత్:హే అచ్యుతా! నీ నామ ప్రభావము వలన ఈ సుప్రభాతము కపటముగా చెప్పబడినను అచ్యుతమగుగాక. అచ్యుతవర్ణనము అచ్యుతమేగదా! మరియూ భక్త జనులకు గ్రాహ్యమగుగాక. ఓ యాదగిరినరహరీ! నీకు సుప్రభాతము

**33.ఇత్థం యాదాద్రినాథస్య సుప్రభాత మతంద్రితా:**

**యే పఠంతి నరా భక్త్యాతే నరా స్సుఖభాగిన:**

తాత్: ఇట్టి శ్రీ యాదగిరి లక్ష్మీనృసింహుని సుప్రభాతమును ఎవ్వరైతే ప్రతినిత్యము ప్రాత: కాలమున అనుసంధించుకొందురో అట్టివారు శ్రీ నరహరి కృపవల్ల సకలైశ్వర్యములను పొందుదురు

శ్రీ యాదగిరి లక్ష్మీనృసింహ సుప్రభాతం సమాప్తమ్.

**శ్రీ లక్ష్మీనృసింహాయ నమ:**